## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని తూపంల్లి గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో నవగ్రహ, ధ్వజ స్తంభం, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనోత్సవం గ్రామస్తులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరంగా ఆత్మకూరు నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గీతా కార్మిక శాఖ చైర్మన్ నాగరాజ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హనుమంతు, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, నాయకులు సిద్ధార్థరెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఆయూబ్‌ఖాన్, రహమతుల్లా, శ్రీనివాసులు, తులసిరాజ్ పాల్గొన్నారు.

## ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ దంపతులు

మల్దకల్, ఫిబ్రవరి 22 : మండలకేంద్రంలో నిర్వహిస్తున్న రజక ఆరాధ్య దైవం మడిమాల మాచిదేవ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారంతో ముగిశాయి. అర్చకులు రమేశాచారి, మధుసూధనాచారి, ప్రసన్నాచారి, వెంకోబరావు, శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య వేకువజామున 4 గంటలకు మాచిదేవ స్వామితో పాటు ఈశ్వర నంది, గణపతి విగ్రహాల యంత్ర ప్రాణప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ విజయ్‌కుమార్, గడ్డం కృష్ణారెడ్డి, సత్యారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, జంబు రామన్ గౌడ్, రజకులతోపాటు, మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి గుంటి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

అయిజ, ఫిబ్రవరి 22: రాజాపురంలో వెలిసిన స్వయంభూ గుంటి రంగనాథుడు భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తూ.. కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. శ్రీదేవీ, భూదేవీ సమేత వెలిసిన గుంటి రంగనాథ స్వామి ఆలయ క్షేత్రం భక్తుల ఇలవేల్పుగా పేరుగాంచింది. ప్రతి ఏటా మాఘశుద్ధ చతుర్ధశి నుంచి మాఘ శుద్ధ పౌర్ణమి వరకు గుంటి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. శుక్రవారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. రాజాపురంలో గట్టుపైన పెద్ద బండరాళ్ల నడుమ గుంటి రంగనాథుడు దశాబ్ధాల క్రితం స్వయంభూగా వెలిశాడని ఇక్కడి భక్తుల విశ్వాసం. నాటినుంచి గుంటి రంగనాథుడిని సమీప గ్రామాలైన పులికల్, బైనపల్లి, కొత్తపల్లి, కిసాన్‌నగర్, మేడికొండ, సింధనూరుకు చెందిన భక్తులతోపాటు కర్ణాటక, ఏపీకి చెందిన భక్తులు తమ ఇంటిదైవంగా కొలుస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో తినుబండారాలు, పిల్లల ఆటవస్తువులు, వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ అన్నిరకాల చర్యలు చేపట్టింది.

## లక్ష్మీవేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవం

అయిజ, ఫిబ్రవరి 22: మండలంలోని కేశవరం సమీపంలో గట్టుపై వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. శుక్రవారం ఉదయం 7 గంటలకు తుంగభద్ర నదీ గంగపూజ, 8 గంటలకు లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి తుంగభద్ర జలాలతో అభిషేకం, 10గంటలకు పల్లకీ సేవ, సాయంత్రం 7గంటలకు పల్లకీసేవ, ప్రభోత్సవం, శనివారం ఉదయం 10:30 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, 11గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, సాయంత్రం 7గంటలకు పల్లకీ సేవ, 7:30 గంటలకు రథోత్సవం, 8గంటలకు జ్యోతి అలంకరణ ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలివచ్చి స్వామి కృపకుపాత్రులు కావాలని కోరింది.

## ఎల్లమ్మకు వెండి వితరణ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 22: మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లోని రామచంద్ర నగర్‌కు చెందిన వెంకోజి కుమారులు కటిక రఘు, శివతేజ స్థానికంగా వెలిసిన ఎల్లమ్మ(జమ్ములమ్మ) అమ్మవారికి 500గ్రాముల వెండిని ఆలయ నిర్వాహకులకు గురువారం అందజేశారు. అమ్మవారి కిరీటం, నాగపడగ తయారీకి ఈ వెండిని ఉపయోగిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 23వ తేదీ ఎల్లమ్మ మాత ఉత్సవ విగ్రహ పూజా కార్యక్రమాలు, 24న అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కూలీలను పెంచాలి

ఇటిక్యాల, ఫిబ్రవరి 22: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలను పెంచాలని డీఆర్‌డీవో పీడీ నర్సింగ్‌రావు సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతిఒక్కరికీ మార్చి 31లోగా, వందరోజుల పనికల్పించేందుకు కృషి చేయాలన్నారు. శుక్రవారం నుంచి ప్రతిపంచాయతీ పరిధిలో 60మందికి తగ్గకుండా కూలీలు పనిలో ఉండాలన్నారు. అలసత్వం వీడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ అజర్ మహియుద్దీన్, ఎంపీవో భాస్కర్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిసిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**బహిరంగ ప్రకటన** తేది: 22.02.2024
నేను మేకల శ్రీనివాస్ తండ్రి మేకల బాలయ్య, వృత్తి: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, నివాసం: ఇ.నెం. 14-4-160, వెంకటేశ్వర నిలయం, గ్రామ పంచాయతి, దొడ్డలోనిపల్లి, H/o బోయపల్లి గ్రామ శివారులో గల భూమి సర్వే నం. 155/ఇ లో గల ప్లాటు యొక్క వైశాల్యం 200.0 చ॥గ॥ల ప్లాటుకు సంబంధించిన డాక్యుమెంట్ నం 2855/2006, రిజిష్టర్ విక్రయ దస్తావేజులు రిజిస్టేషన్ ఆఫీస్ నుంచి నా ఇంటికి ఆటోలో వెళ్తున్నప్పుడు ఎక్కడో పడిపోయాయి, ఇట్టి డాక్యుమెంట్ ఎవరికైన దొరికినో క్రింది అడ్రసుకు సంప్రదించగలరు, ఇట్టి డాక్యుమెంట్ తెచ్చిన వారికి తగిన పారితోషికము ఇవ్వబడును. సంప్ర॥ మేకల శ్రీనివాస్ తండ్రి మేకల బాలయ్య, R/o ఇ.నెం. 14-4-160, వెంకటేశ్వర నిలయం భగీరథ కాలనీ, మహబూబ్‌నగర్, సెల్: 8639121387

**ప్రకటన**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# విడుతల వారీగా పథకాల అమలు

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 22 : సంక్షేమ పథకాలను విడుతల వారీగా అమలు చేస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కానాయపల్లి, సంకిరెడ్డిపల్లి, రాయినిపేట, వడ్డెవాటలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో మొదటి విడుతగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పది లక్షల ఆరోగ్యశ్రీ అమలైందని, ఈనెలలోపు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో పర్యటించి సమస్యలను అధ్యయనం చేసి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రావుల జితేందర్‌నాథ్‌రెడ్డి, సురేందర్‌నాథ్‌రెడ్డి, మేస్త్రీ శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, మిషేక్, మన్యం, పీజేబాబు, బీచుపల్లి పాల్గొన్నారు.



సంకిరెడ్డిపల్లిలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

## బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

ధరూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని రేవులపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తెలుగు చిన్నరాముడు తమ్ముడు బీఆర్ఎస్ కార్యకర్త చిరంజీవిని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి గురువారం పరామర్శించారు. ఇటీవలే చిరంజీవికి యాక్సిడెంట్ కావడంతో విషయం తెలుసుకున్న బండ్ల జ్యోతి గ్రామానికి వెళ్లి పరామర్శించి యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేటీఆర్ యువసేన ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భీమయ్య, కురుమన్న, పాషా, కృష్ణయ్య, రెహమాన్ పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించాలి

గద్వాలటౌన్, ఫిబ్రవరి 22 : దీర్ఘకాలికంగా ఆస్తి పన్నులు చెల్లించకుండా మొండికేసిన బకాయిదారులపై మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మొండి బకాయి దారులకు సంబంధించిన దుకాణాలను సీజ్ చేశారు. కిరాయి చెల్లించకుండా మున్సిపాలిటీకి ఎక్కువ మొత్తంలో బకాయి పడ్డ దుకాణాలను సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ శంకర్‌సింగ్ హెచ్చరించారు. నోటీసులు ఇచ్చినా స్పందించని వారి దుకాణాలను ఇప్పటికే సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

## అబుల్ కలాంకు ఘన నివాళి

పెబ్బేరు, ఫిబ్రవరి 22 : స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా గురువారం పెబ్బేరులో ఆయనకు ఘన నివాళులర్పించారు. మండల ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చౌరస్తాలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్, నాయకులు జాకీర్, ఆరీఫ్, మస్తాన్ పాల్గొన్నారు.

## విద్య దార్శనీకుడు ఆజాద్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 22 : దేశ మొదటి విద్యాశాఖ మంత్రి, విద్య దార్శనీకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మౌలానా అబుల్ కలాం వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యాఖ్యత డాక్టర్ నాయకంటి నర్సింహాశర్మ, ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు మండ్ల దేవన్ననాయుడు, నాగరాజు, బాలేమియా, పరమేశ్వరాచారి, మాధవాచారి, భాషానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయాలను దర్శించుకున్న పీఠాధిపతి



ఆలయంలో పుష్పగిరి పీఠాధిపతి తదితరులు

అలంపూర్, ఫిబ్రవరి 22: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను కడప జిల్లా పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకరస్వామి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, ఈవో, ఆలయ పాలక మండలి సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.అలాగే ప్రసాద్ స్కీం పనులను గురువారం రాష్ట్ర పర్యాటక శాఖ ఎస్ఈ ఎండీ సంయుద్దీన్ పరిశీలించారు. పనులు వేగవంతగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రసాద్ పనుల వద్ద నుంచి జోగుళాంబ ఆలయం వరకు ప్రహరీ గోడవెంట వేసిన సీసీరోడ్డు పనులను పరిశీలించారు.ఆలయాల పరిసరాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. కార్యక్రమంలో ప్రసాద్ స్కీం డీఈ ధన్‌రాజ్, సీఈ వెంకటరమణ, చైర్మన్ చిన్నకృష్ణయ్యనాయుడు ఉన్నారు.

## ఉద్యోగులకు బదిలీలు తప్పవు



కమిషనర్‌నుస న్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

వనపర్తి,ఫిబ్రవరి 22 : ప్రభుత్వ ఉద్యోగికి వృత్తి రీత్యా బదిలీలు తప్పవని, పట్టణ అభివృద్ధి ఎంతోగాను ముందుకు సాగిందని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో బదిలీపై వెళ్తున్న కమిషనర్ విక్రమ సింహహారెడ్డిని వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లతో కలిసి చైర్మన్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం కమిషనర్ చాలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, నాగన్నయాదవ్, బండారు కృష్ణ, సమ్మద్, ఉంగ్లం తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, శేఖర్, కోటీశ్వర్‌రెడ్డి, రమేశ్ మున్సిపల్ అధికారి ఉమమహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణం..కమనీయం

కొత్తకోట, ఫిబ్రవరి 22 : పట్టణ సమీపంలోని భూ లక్ష్మీ వేంకటేశ్వరుని కల్యాణం గురువారం వేద పండితులు కమనీయంగా నిర్వహించారు. మాఘశుద్ధ త్రయోదశిన వేంకటేశ్వరుని కల్యాణాన్ని 11.55గంటలకు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, వరలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. స్వామివారి కల్యాణం అనంతరం అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు పోశారు. అలాగే ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీందర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, విశ్వేశ్వర్, అయ్యన్న, ప్రశాంత్, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, మిషేక్ పాల్గొన్నారు.

***కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు***

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 22 : మండలంలోని గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ముందుగా వారికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

## తిమ్మప్పస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అయిజ, ఫిబ్రవరి 22: స్వయంభూ కట్టకింద తిమ్మప్ప (వేంకటేశ్వర)స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. పట్టణానికి సమీపంలో స్వయంభూ కట్టకింద తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం భక్తుల గోవింద నామస్మరణలు, భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ప్రాంగణంలో మామిడి తోరణాలు, కొబ్బరి ఆకులతో పందిరి వేసి పుట్టమన్ను, పూలు తెచ్చి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత కట్టకింద తిమ్మప్పస్వామికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి చిన్న రథంపై శ్రీవారు ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



తిమ్మప్పస్వామిఆ లయంలో పందిరి వేస్తున్న భక్తులు

***నేడు శ్రీవారి కల్యాణం***

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం కట్టకింద తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజల నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు హోమం, రాత్రి 9:15గంటలకు శ్రీవారి కల్యాణం నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

## తండాల్లో పాలమూరు ఎన్‌ఆర్‌ఐ బృందం పర్యటన

కేటీదొడ్డి, ఫిబ్రవరి 22 : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు, బడి బయటి పిల్లల కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పాలమూరు ఎన్‌ఆర్‌ఐ బృందం తెలిపింది. తండా పర్యటనలో భాగంగా వారు గురువారం మండలంలోని మల్లాపురం, మల్లాపురం తండా, సిద్ధోనిపల్లి తండాల్లో పర్యటించి పాఠశాలలను పరిశీలించారు. ముఖ్యంగా చదువులో వెనకబడిన, బడి బయటి పిల్లలు, ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకోసం ఉపాధ్యాయులు చేస్తున్న బోధన విధానాన్ని పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, సీఆర్‌పీఎఫ్ సభ్యులు పాండు, ఎస్ఎంసీ చైర్మన్, ఎన్‌ఆర్‌ఐ సభ్యులు శ్రీకాంత్, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాయికుమార్, మల్లాపురం తండా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, సులేమాన్ పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నఎన్ ఆర్‌ఐబ ందం

## ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 22 : ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి తప్పా అర్హతకు మించి వైద్యం చేయరాదని డిప్యూటీ డీహెచ్‌ఎంవో సిద్ధప్ప సూచించారు. కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి శశికళ ఆదేశాల మేరకు.. గురువారం జిల్లాలో డిప్యూటీ డీహెచ్‌ఎంవోతో పాటు మరో పది మంది వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. కేటీదొడ్డి మండలంలోని నందిన్నె, కేటీదొడ్డి, కుచినేర్ల, గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి తదితర గ్రామాల్లో గ్రామీణ వైద్యుల క్లినిక్‌లను తనిఖీ చేశారు. కొంత మంది ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తున్నారని గుర్తించి వారి క్లినిక్‌లు, మెడికల్ షాపులను సీజ్ చేశారు. అనంతరం వారి వద్ద నుంచి అత్యధిక మోతాదు మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధప్ప మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది ఆర్‌ఎంపీలు రోగి సమస్య గుర్తించకుండానే అధిక మోతాదు మందులను ఇస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అవగాహన లేని ఆర్‌ఎంపీలను సంప్రదించి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులు రాజు, రామాంజనేయులు, శ్యాం సుందర్, నర్సింహులు, సూర్యానాయక్, నర్సయ్య ఉన్నారు.



జాతీయ రహదారిలో నిరసన తెలుపుతున్న రైతులు

## బ్రిడ్జి ఎత్తును పెంచాలని రైతుల నిరసన

రాజోళి, ఫిబ్రవరి 22 : రాజోళి మండల పరిధిలో నిర్మాణం చేపడుతున్న భారత్‌మాల జాతీయ రాహదారిలో రాజోళి మండల కేంద్రం నుంచి శాంతినగర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి ఎత్తును పెంచాలంటూ రాజోళి రైతులు డిమాండ్ చేశారు. గురువారం రహదారి నిర్మాణం పనులను అడ్డుకొని గంటసేపు నిరసన వ్యక్తం చేశారు. రహదారి అధికారులు డీజీఎం జనార్దన్, డీపీఎం రవిచంద్రకు వినతిపత్రం కూడా అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాజోళి మండలంలో వివిధ గ్రామాల్లో వ్యవసాయం పనులు, పంటల అమ్మకాల కోసం ఈ రహదారి మీదనే వెళ్తుంటారన్నారు. అయితే ఈ బ్రిడ్జి ఎత్తు నాలుగు మీటర్లు ఉండడంతో పంటలు తరలించేందుకు ఇబ్బందులు ఎదరయ్యే అవకాశం ఉందని, దీని ఎత్తును 8మీటర్లకు పెంచాలని రైతులు కోరారు.

# ఘనంగాస్వ యంపాలనది నోత్సవం

గద్వాలటౌన్, ఫిబ్రవరి 22 : జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్, డీఈవో, ఉపాధ్యాయులుగా, వ్యవహరించిన తీరును ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, బీసన్న, మహేందర్, శ్రీనూనాయక్, శకుంతల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

***విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ***

వనపర్తి, ఫిబ్రవరి 22 : మండలంలోని అచ్యుతాపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించినట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మాజీ సర్పంచ్ శారద, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీగంగన్న, మాజీ ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పాపమ్మ, మాజీ వార్డు సభ్యుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

***మల్దకల్ మండలంలో..***

మల్దకల్, ఫిబ్రవరి 22 : మండలంలోని బిజ్వారం, ఎల్కూర్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ కనబర్చి విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బహుమతులు అందజేశారు.

***కేజీబీవీలో ..***

గట్టు, ఫిబ్రవరి 22 : కసూర్బా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాళ్లుగా స్వాతి, రాధిక, డీఈవోగా ప్రియాంక, ఎంఈవోగా మరియమ్మ వ్యవహరించి మెప్పించారు. కార్యక్రమంలో ఎస్‌వో గోపిలత, అధ్యాపకులు పాల్గొన్నారు.



కేజీబీవీలో స్వయం పరిపాలనది నోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు



బిజ్వారంలో ఉపాధ్యాయులవేష ధారణలో విద్యార్థులు

## ఏఎస్పీ రవి బదిలీ

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 22 : జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రవి వరంగల్ కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నత పోలీస్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఏఎస్పీ రవి మాట్లాడుతూ జిల్లాలో 7నెలల పాటు విధులు నిర్వర్తించడం సంతృప్తి నిచ్చిందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది చాలా సహకారం అందించారని, వారి సేవలు మర్చిపోలేనివని కొనియాడారు. అనంతరం ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు..పోలీస్ అధికారులు ఏఎస్పీని శాలువా కల్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు నరేందర్ రావు,నా గేందర్, నయీం, లోహిత్, రవిశంకర్, హనీఫ్, రామిరెడ్డి, హన్మంత్, రెహనా ఉన్నారు.

## చిన్నపిల్లల కథ సుఖాంతం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 22 : వనపర్తి పట్టణంలో మిస్సింగ్ అయిన చిన్న పిల్లలు దొరికారని సీఐ నాగభూషణరావు, ఎస్సై జయన్న తెలిపారు. గురువారం వారు విలేకర్ల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వనపర్తి పట్టణానికి చెందిన చిన్న పిల్లలు పావని, మౌనికలు రెండు రోజుల కిందట తప్పిపోయారని వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్పీ ఆదేశాల మేరకు నాలుగు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టమన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీల ఆధారంగా వారి ఆచూకీ కనుగొన్నామని వారు ఒక బ్యాగును తీసుకొని కర్నూల్ బస్సు ఎక్కారని తర్వాత బీచుపల్లి ఆంజనేయస్వామి దర్శనం చేసుకొని గద్వాల వెళ్లారని, అక్కడి నుంచి మంత్రాలయం వెళ్లారని సీఐ చెప్పారు. వెంటనే చిన్న పిల్లల గురించి మంత్రాలయం ఎస్సైకి వివరాల తెలియజేయగా పిల్లలను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడి నుంచి వనపర్తి ఎస్సై జయన్న సిబ్బందితో కలిసి మంత్రాలయం వెళ్లి చిన్న పిల్లలను వనపర్తి పోలీస్ స్టేషన్‌కు తీసువచ్చి వారిని వారి తల్లిదండ్రులకు అప్పగించామని సీఐ తెలిపారు. దీంతో జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లల మిస్సింగ్ కథ సుఖాంతమైంది.

## ఉద్యోగ మేళా విజయవంతం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 22 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళా విజయవంతమైందని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయ అధికారి మహ్మద్ జాన్ పాషా చెప్పారు. కేఎల్ గ్రూప్ అమెజాన్, కేఎల్ గ్రూప్ వీ గార్డ్ ప్రీమియర్ సోలార్ కంపెనీ, సాక్షి న్యూస్ పేపర్, ధరణి ఇన్ఫ్రాస్ట్రక్చర్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, స్పాడర్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగ మేళాను నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన వారికి మంచి వేతనాలతో 700 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ మాట్లాడుతూ ఉద్యోగ స్థాయిని బట్టి రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వేతనం ఇవ్వగల కంపెనీలున్నాయని , యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగ మేళాల్లో మొత్తం 80మంది పాల్గొనగా వివిధ కంపెనీలకు 16మంది ఎంపికైనట్లు చెప్పారు.

## మొక్కలను సంరక్షించాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 22 : నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో కోటేశ్వర్ అన్నారు. మండలంలోని అన్నారం తండాలోని వననర్సరీని గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరందించాలన్నారు. అదేవిధంగా ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా ఇంటిపన్నులు వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాములు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

వడ్డేపల్లి, ఫిబ్రవరి 22: మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లోని డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి గద్వాల నుంచి ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్ నుంచి డాక్టర్ వేనియం తేజశ్రీ, రాకేశ్ బృందం వచ్చారు. 30యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. రక్తదానం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చంద్రమోహన్, శివనారాయణ, అధ్యాపకులు జీవా జయరాజ్, వెంకటేశ్, బీసన్న, ప్రదీప్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 22 : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం ఈనెల 15 నుంచి ఏప్రిల్ 22వరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టినట్లు వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2024కు గానూ ప్రవేశాల కోసం పదో తరగతి విద్యార్థులు www.polycettealangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 22వరకు ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులకు రూ.500 రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 24వరకు రూ.100 రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## ఆకట్టుకున్న సందెరాళ్ల ఎత్తు పోటీలు

అయిజ, ఫిబ్రవరి 22: మండలంలోని మూగోనిపల్లి గ్రామంలో పెద్దమ్మ దేవర ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సందెరాళ్ల ఎత్తు పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీలకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బలభీములు తరలివచ్చారు. పోటీల్లో రాయిచూర్ జిల్లా, నాగన్‌దొడ్డికి చెందిన ప్రతాప్, గుడె బల్లూరుకు చెందిన సూరి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. గట్టు మండలం, మిట్టదొడ్డికి చెందిన ఉరుకుంద తృతీయ, గట్టు మండలం, బల్గెరకు చెందిన హన్మంతు నాల్గో స్థానం కైవసం చేసుకున్నారు. విజేతలకు గ్రామ పెద్దలు, యువకులు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## తాసీల్దార్ బాధ్యతలు స్వీకరణ

పాన్‌గల్, ఫిబ్రవరి 22 : పాన్‌గల్ తాసీల్దార్‌గా శుభాష్‌నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన రాంబాయి ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు.